స్వాతి సపరివార పత్రిక *(20-02-87)*

# గాంధీ పుట్టిన దేశం

**మా**స్టారూ!

మీరు ఆశించినంత ఉన్నత స్థితికి రాగలిగానో లేదో నేను చెప్పలేను. కాని, నా శక్తి కొద్దీ చదివి ఆసక్తికొద్దీ ఇంతదూరం వచ్చాను. ఇక్కడ యూనివర్శిటీలో, ఓరియంటల్ లాంగ్వేజ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను. స్వయంగా వచ్చి మీ ఆశీర్వాదం తీస్కోలేక పోయినా ఈ సంగతి విని మీరు సంతోషిస్తారని ఈ ఉత్తరం రాస్తున్నా.

ఒక ముఖ్య విషయం. రిచర్డ్ అటెంబ్బరో తీసిన 'గాంధీ' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా కీర్తి తెచ్చుకున్న సంగతి మీకు తెల్సిందే! ఇక్కడ జర్మనీలో కూడ అనేకమంది ఆ సినిమా చూసి చాలా ఉత్తేజితులయ్యారు. అలాంటి వారిలో జేన్ ఒకతె. ఆమె నా స్టూడెంటు. చాలా తెలివైన పిల్ల. మాతృభాష జర్మన్ కాకుండ ఇంగ్లీషు, ఫ్రెంచి, స్పానిష్ ఈ మూడింటిలోను ప్రావీణ్యం వుంది. ఓరియంటల్ లాంగ్వేజస్‌లో సంస్కృతం తీసుకుంది. మన దేశభాషలంటే ఆ పిల్లకి మక్కువ. హిందీ, తెలుగు ఒకేసారి నేర్చుకోవటం ప్రారంభించింది. చిత్రం ఏమిటంటే హిందీకంటె తెలుగు తొందరగా రావటం. చక్కగా చదవగలదు. రాయగలదు. కొంచెం యాస తప్ప స్పష్టంగా మాట్లాడగలదు.

ఇన్ని భాషలు నేర్చుకుంటూ ఓ వైపున ఆంత్రోపోలజీలో థీసిస్ మొదలు పెట్టింది. దానికి కావల్సిన మెటీరియల్ కోసం ఆమె ఇండియాకి రావాలనుకుంటోంది. ఆమె నా సలహా అడిగినప్పుడు చటుక్కున మీరే గుర్తుకు వచ్చారు. జేన్‌ని మీకన్న ఆదరంగా చూసే వాళ్ళెవరూ ఉండరు!

ఆమె రాకపోకలన్నిటికీ ఏర్పాట్లు చేశాను. ముందు బొంబాయికి వచ్చి అక్కడనుంచి హైదరాబాదు వస్తుంది. వచ్చిన వెంటనే మిమ్మల్ని కాంటాక్టు చేస్తుంది. శ్రమ అనుకోక హైదరాబాదు వచ్చి ఆమెను కూడా తీసుకువెళ్ళండి. బహాశ మన వూళ్ళో ఆమె వారం పదిరోజులుంటుంది. ఆమె మన ప్రాంతాల్లో కొందర్ని ఇంటర్వ్యూ చేస్తుంది. మీరు కాని మీ పిల్లలు కాని ఎవరయినా ఆమె వెంట వుంటే మంచిది. ఒక కారు అద్దెకి తీసుకోండి. ఖర్చుకోసం సందేహించకండి. దీనితో రెండువేల మార్కుకి చెక్కు పంపిస్తున్నాను. (అంటే దాదాపు ఎనిమిదివేల రూపాయలు) వెంటనే మీ బ్యాంకు అక్కౌంటులో జమచేయండి. ఆమె ఇండియాకి వచ్చేసరికి మీ చెక్కు మారుతుంది.

మీరున్నారు. ఆమెకెటువంటి ఇబ్బందీ కలగదని నాకు ధైర్యం. ఆమె ఫొటో దీనితో జతపరిచి పంపుతున్నాను. ఇది అందిన వెంటనే జాబు వ్రాయండి.

సాధ్యమయినంత తొందరలో మిమ్మల్ని కలుస్తాను. నమస్సులతో మీ శిష్యుడు.

– రామమోహనరావు

ఆ ఉత్తరం చదివేసరికి పరమానంద భరితుడయిపోయాడు సూర్యనారాయణ మాస్టారు. చిన్నపిల్లాడిలా వాలు కుర్చీలోంచి గెంతి ఇంట్లో అందర్నీ పిలిచాడు. ఇదిగో, శిష్యుడంటూ ఒక్కడిలాంటి వాడుంటే చాలు. జన్మ చరితార్థమవుతుంది!...." అన్నాడు. ఆయన కళ్ళనిండా నీళ్ళే!

"అబ్బ..... ఏడు భాషలు చదివిందా! మనం మూడు భాషలకే మూడు చెఱువుల నీళ్ళు తాగుతున్నామే!" అన్నాడు మాస్టారి చిన్నబ్బాయి రవి.

"వారానికి మూడు సినిమాలు చూడటం మానేసి రోజుకి కనీసం మూడుగంటలు చదివితే ఏడు కాదురా – పదిహేడు భాషలు నేర్చుకోవచ్చు!"

"నాన్నగారలా గన్నారని వెధవ ముఖం పెట్టావు కాని పుట్టపర్తి నారాయణాచార్యులుగారు పధ్నాలుగు భాషల్లో పండితులు తెలుసా! మనదేశంలోనూ సమర్థులున్నారు" అంది మాధవి.

"అరెరే, కబుర్లలో పడి చెక్కు విషయం మర్చిపోయా, బ్యాంకుకి వెళ్ళాలి...." అని లేవ బోయాడు మాస్టారు.

"మరి ఏమిటి నాన్న! ఇప్పుడు మూడయ్యింది. ఇంక బ్యాంకు ఎక్కడిది!" అని నవ్వింది మాధవి.

"ఈ మతిమరుపు మాస్టార్ని చూసి ఆ అమ్మాయి దడుచుకుంటుంది. ఎందుకేనా మంచిది ఆ సంగతులేవో నువ్వే చూసుకోమ్మా!" అని పరిహాసం చేసింది మాస్టారి భార్య శాంతమ్మ.

పట్టరాని ఆనందంలో మాస్టారికేం చేయాలో తోచలేదు. రామ్మోహనరావు ఉత్తరానికి జర్మనీకి జవాబు రాయటం లగాయతు, అతను పంపిన చెక్కును బ్యాంకులో వేయటంలోను, ఆ తర్వాత అద్దెకారుని బుక్ చేయటంలోను.... హైదరాబాద్ వెళ్ళి జేన్‌ని తీసుకు రావటం లోను... అన్నిటికీ మాధవి సలహా కావల్సి వచ్చింది. తోడు కావల్సి వచ్చింది.

ఆమె సమయస్ఫూర్తి.... మన్నన భారత దేశానికి మొదటిసారి వచ్చిన జేన్‌ని ఎంతగానో ఆకట్టుకున్నాయంటే - పరిచయమయి రెండు గంటలయిందో లేదో - "మీ దేశం గురించి చదివాను. విన్నాను. ఇప్పుడు చూస్తున్నాను. మీ దేశమే కాదు.... మీరు కూడా అందంగా వుంటారు!" అంది.

మాధవి చిరునవ్వు నవ్వింది. "ఆ అందం మాదికాదు. అది చూసే మీ కళ్ళల్లో వుంది."

జేన్ కళ్ళు వింతగా మెరిసాయి. "ఓహ్! మీ భాష అంత తియ్యగా ఎదుకుంటుందా అనుకున్నాను. మీ భావాలు మధురంగా ఉండటం వల్లనేనని ఇప్పుడు తెలిసింది."

"ఎంత చక్కగా మాట్లాడతారు మీరు! మా దేశం మీద మా భాషమీద మా మీద మీరు చూపిస్తున్న అభిమానానికి మేమేవిధంగా థేంక్స్ చెప్పగలం మీకు!"

"థేంక్స్ కాదు.... కృతజ్ఞతలనాలి!" అంది జేన్ నవ్వుతూ.

"మైగాడ్! మీ దగ్గర మాట్లాడాలంటే ఇక భయమే!"

"మైగాడ్ కాదు.... ఓ భగవంతుడా అని అనాలి!"

మాధవి సిగ్గుపడిపోయింది. ఓడిపోయానన్నట్టు తల పంకించింది.

"స్త్రీకి సిగ్గే సింగారమని చదివాను. ఆ సింగారమేమిటో మిమ్మల్ని చూసాక తెలిసింది!"

"మా భాషకి కొత్త అందాలు సమకూరుస్తున్నారు మీరు."

రామ్మోహనరావు చెప్పిన దానిలో ఎక్కడా అతిశయోక్తి అనిపించలేదు జేన్‌కి. మాస్టారి ఆతిథ్యం దొరికింది. మాధవి స్నేహం లభించింది. తనకన్ని సౌకర్యాలు సమకూరాయి.

మాస్టారి పెద్దకూతురు లక్ష్మికి పురిటి రోజులు. ఆయన ఇల్లు కదలలేని పరిస్థితి. అప్పటికీ రెండు రోజులపాటు జేన్‌కి తోడుగా వుండి వూరంతా చూపించారాయన. "ఇవేళ నేనింట్లో వుండటం మంచిదంటోంది మీ అమ్మ!?"

"పోనీ మీరుండిపోండి నాన్నా! అలవాటయిందిగా.... జేన్‌ని నేను తీసుకువెళ్ళ గలను" అంది మాధవి. కారు బయలుదేరుతోంటే 'జాగ్రత్త'ని రెండుసార్లు చెప్పారు మాస్టారు.

డ్రయివరు సింహాచలం చిరునవ్వు నవ్వాడు. "జాగ్రత్తగా తీసుకువెళ్ళి జాగ్రత్తగా తీసుకు వస్తా. మీరేం కంగారు పడకండి మాస్టారు!" అన్నాడు.

తీరా దారిలో వాడు వేసిన ప్రశ్నలు వినేసరికి మాధవి మనస్సులో లేనిపోని భయాలేవో మొదలయ్యాయి. గత రెండు రోజులుగా తండ్రి పక్కనుండగా నోరు మెదపనివాడు ఇప్పుడు అదేపనిగా మాట్లాడ్డం ఆమెకిబ్బందిగా వుంది. జేన్ ఏమనుకుంటుందో అని బిడియం ఒకమూల....! అప్పటికీ ఓర్పుగా వాడడిగిన ప్రశ్నలన్నిటికీ జవాబులు చెప్పింది.

సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేదాకా ఆమె బిక్కు బిక్కుమనే గడిపింది. వాడు అడగకూడనివేమీ అడగలేదు.... జేన్ చేస్తున్న థీసిస్ ఏమిటి? అంత డబ్బు ఖర్చుపెట్టుకొని ఇంతదూరం వచ్చి ఆమె చేస్తున్న ఇంటర్వ్యూల వల్ల ప్రయోజనం ఏమిటి?.... కేవలం కుతూహలం కొద్దీ అడిగాడే తప్ప జేన్‌ని హేళన చేయాలని కాదు. అనవసరంగా భయపడ్డానే అనుకుంది మాధవి!

జేన్‌తో మాధవి ఇంటికి తిరిగివచ్చేసరికి ప్రసాద్ వచ్చివున్నాడు.... ప్రసాద్ మంచి జల్సారాయుడు. అందమయిన అమ్మాయిలు కనిపిస్తే చాలు సిగ్గు సంకోచం లేకుండా కళ్ళతో తినేస్తూ చూస్తాడు. భర్తది ఎంత తుంటరి బుద్ధో లక్ష్మికి తెలియదు కాని బావగారి శ్రుతిమించిన సరసం స్వయంగా అనుభవించిన మాధవికి బాగా తెలుసు. తమ గౌరవం ఎలా కాపాడుకోవాలా అని సందిగ్ధంలో పడింది ఆమె.

జేన్ పాశ్చాత్య మహిళ. పాశ్చాత్యులకి నీతి నియమాలుండవని.... ఎవరితో పడితే వాళ్ళతో రొమాన్సు చేసేస్తారని ప్రసాద్‌కి మహా నమ్మకం. జేన్ వచ్చిన సంగతి విన్న వెంటనే 'కన్ను గీటితే ఆమె వచ్చి తన వొళ్ళో వాలటం ఖాయం' అనుకుంటూ లొట్టలు వేసాడు. ఆమెను గుమ్మంలో చూస్తూనే "హలో! ఐయామ్....." అంటూ ఇంగ్లీషులో పరిచయం చేసుకుంటూ చేయిచాచాడు.

చేతులు జోడించి నమస్కారం పెడుతూ "మీకు తెలుగు రాదా!" అని నవ్వింది జేన్.

నల్లబడిపోయిన బావగారి ముఖం చూసేసరికి మాధవికి నవ్వాగలేదు. "మా బావగారు అసలు సిసలు తెలుగువాడు. అంటే ఇంగ్లీషులో తప్ప తెలుగులో మాట్లాడ్డు."

ఆడపిల్ల ఒంటరిగా దొరికినప్పుడే తన ప్రతాపం చూపించుకొనే ప్రతిభాశాలి ప్రసాద్! జేన్ మర్నాడు పర్యటనకి బయటకి వెడుతుంది కదా. అప్పుడు బుట్టలో వేసుకోవచ్చు అని అప్పటికి తగ్గిపోయాడతను.

మర్నాడు, "పోనీ, నువ్వు కూడా పిల్లలతో పాటు కొంచెం తోడు వెళ్ళవోయ్" అన్నాడు మాస్టారు.

మామగారి సలహాకి ప్రసాద్ పరమానందభరితుడయ్యాడు. కాని, మాధవికి గుండెల్లో

రాయి పడింది. బావకూడా వచ్చాడంటే ఏవో తుంటరి మాటలు మానడు. ఇంతవరకు జేన్‌కి తామంటే ఎంతోమంచి అభిప్రాయం వుంది. ఇవేళ మర్యాద దక్కుతుందో లేదో....! మాధవి నోరు తెరవటానికి ముందే కారెక్కి కూర్చున్నాడు ప్రసాద్. ఇంకేమనగలదు?

కారు బయలు దేరింది. ప్రసాద్ ఎప్పటిలా ఏదో ప్రేలాపన ప్రారంభించాడు. జేన్ గురించే ఆలోచిస్తూ పరిసరాలు మరిచిపోయింది మాధవి.

కారు చటుక్కున ఆగిపోయిన కదుపుకి ఆమె స్పృహలోకి వచ్చింది.

కారుకడ్డంగా స్కూటర్లు పెట్టి నిలబడి ఉన్నారు. అర్గురు....!

మాధవి పరిచయమయిన రెండు ముఖాల్ని గుర్తుపట్టింది. ఆమెకు ఏదో భయంతో గుండెలు దడదడలాడాయి.... అయినా తాము నల్గురం ఉన్నాం కదా. అని వెంటనే ధైర్యాన్ని కూడదీసుకుంది.

"ఎవరు మీరు?" అని గదమాయిస్తూ అడిగాడు ప్రసాద్.

వాళ్ళల్లో ఒకడు "నువ్వెవరు?" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

"హీరోయిన్ బావగార్రా!" అన్నాడు మరొకడు.

"అయితే ఇకనేం! రుచి చూసే వుంటాడు" అన్నాడు ఇంకొకడు. అంతా పగలబడి నవ్వారు.

సింహాచలం వెనక్కి చూసాడు. మాధవి ముఖం ఎర్రగా కందిపోయి వుంది. జేన్‌వైపు చూసాడు. ఆమె ఏమనుకుంటుందో వాడికి అంతుపట్టలేదు....

"ఏమిటి మాధవి? ఎవరు వీళ్ళు?...." అన్నాడు ప్రసాద్ కంగారుగా వెనక్కి తిరిగి.

"నే చెపుతా వినవయ్యా! నేను మాధవి క్లాస్‌మేటుని.... ఇప్పుడు బెడ్‌మేట్‌ని కావాలనుకుంటున్నా!" అన్నాడు రెండోవాడు.

"మీరొట్టి రౌడీల్లా వున్నారు" అన్నాడు ప్రసాద్ గొంతు హెచ్చించి.

వాడే జేబులోంచి గబుక్కున చాకు తీసి దాన్ని తెరిచి ప్రసాద్ గొంతు దగ్గర పెట్టాడు.

"మళ్ళీ నోరు విప్పావంటే గొంతు కోసేస్తా!" అన్నాడు హుంకరిస్తూ. ప్రసాద్ గుటకలు మ్రింగాడే తప్ప మళ్ళీ నోరు విప్పలేదు.

"ఇప్పుడు విను చెపుతా! నా పేరు రాజా! మీ మరదల్ని లవ్ చేసా! లవ్ లెటర్ రాసా. ప్రిన్సిపాల్‌కి రిపోర్టిచ్చింది. నన్ను కాలేజీనుంచి డిబార్ చేసారు. పోనీలో అని ఒక ముద్దివ్వమన్నా! ఇవ్వనంది. చేయిపట్టుకుని ముద్దెట్టుకున్నా... నలుగుర్లోను పట్టుకొని నా చెంప మీద కొట్టింది.... ఇప్పుడు చేతి మీద కాదు ఒళ్ళంతా ముద్దులెట్టుకుంటా ఎవడడ్డం వస్తాడో చూస్తా!"

"ఛ! అడ్డం ఎందుకొస్తాడు? వాడికీ వాటాయియ్యి" అని మరొకడు అందుకున్నాడు.

"ఒంటరిగా ఎప్పుడు దొరుకుతారా అని ఎదురుచూస్తున్నా. ఇవేళ దొరికావు. ఇవేళ నా నుంచి తప్పించుకోలేవే మాధవీ!" అన్నాడు రాజా.

ప్రసాద్ కూర్చున్న డోర్ తెరిచాడు రాజా. "అదిగో!.... అదే మా ఫారం హౌసు. వీళ్ళిద్దర్నీ

అక్కడికి లాక్కుపోతాం. మాతో పాటు నువ్వూ వచ్చి ఈ అందాలన్నీ అనుభవిస్తావా? ఇక్కడే కూర్చుంటావా?....” అని అడిగాడు.

ప్రసాద్ అటూ, ఇటూ కలియజూసాడు.

“ఈవేళ శుక్రవారం సంత. ఇక్కడ చుట్టుపక్కల ఎవ్వరూ లేరు. అరచి చచ్చినా ఎవరూ రారు....”

రాజాని అధాత్తుగా ఒక్క తోపుతోసి రోడ్డు మీదకి దూకి పట్నం వైపు పరుగు ప్రారంభించాడు ప్రసాద్.

అంతవరకు కొంత ధైర్యం మిగుల్చుకున్న మాధవికి ప్రసాద్ పారిపోవటంతో ప్రాణం కడట్టి నట్టయిపోయింది.

“ఒట్టి పిరికిదద్దమ్మ!” వాళ్ళంతా ప్రసాద్ వెళ్ళినవైపే చూస్తూ పగలబడి నవ్వారు.

“ఏంరా? నువ్వేం చేస్తావ్? పారిపోతావా? ఉంటావా?” అని సింహాచలాన్ని అడిగాడు రాజా.

సింహాచలం మాధవిని, జేన్‌ని మార్చి మార్చి చూసాడు. “చాన్సు దొరికితే వదిలి పెట్టకూడదండీ! నేనూ మీ పక్షమే!” అని నవ్వాడు.

“అద్గదీ! మగాడంటే అలా వుండాలి. నీ పేరేంటి?”

సింహాచలం చెప్పాడు.

మాధవికి కోపం ఆగలేదు. “దుర్మార్గుడా! నువ్వు కూడా వాళ్ళతో కల్సిపోతావా? నాన్నగారు నిన్ను నమ్మి తోడు పంపిస్తే ఇంత ఘోరానికి తలబడతావా?” అని తూలనాడింది.

“కోపంలో కూడా ఎంత అందంగా వున్నావే నువ్వు!” అన్నాడు రాజా మాధవి చుబుకం చేతపట్టుకుని.

ఎవరూ లాక్కురాకుండానే జేన్ ఫారమ్ హౌస్ దగ్గరికి నడిచివచ్చింది. కాని, గింజుకుంటున్న మాధవిని లాక్కురావటానికి నలుగురు కావాల్సి వచ్చింది.

తలుపు తాళం తీసాడు రాజా.

“బ్రహ్మాండంగా వుందిరా మీ ఫారమ్ హౌస్. చక్కగా మంచం గించం....అన్నీ ఏర్పాటు చేసి సిద్ధంగానే వుంచినట్టున్నావ్?” అని పగలబడి నవ్వాడు ఒకడు.

మాధవివైపు చూస్తూ కులాసాగా నవ్వాడు రాజా. “.....ఒరేయ్ సింహాచలం! మీ మాస్టారిగారి అమ్మాయి అసలు అందాలు చూడాలంటే ఇలా చూస్తే కాదురా! బట్టలు విప్పేయాలి. చూస్తావేంట్రా.... దాని గుడ్డలూడదియ్యి.”

మాధవి ముఖం కందగడ్డలాగయిపోయింది. అరుస్తోంది. నరాలు తెగిపోతున్నాయి. కాని, నోట్లోని గుడ్డలు అడ్డం ఆమె ఆక్రందనని బయటకు రానివ్వటం లేదు.

సింహాచలం బిగిసిపోయినట్టు నిలబడిపోయాడు.

“ఏమిట్రా సందేహిస్తున్నావ్?” అని అడిగాడు రాజా.

"ఇంతమంది ఉండగా....."

"అంతమందిలోను నన్ను పట్టుకుని కొట్టి అవమానించిందిరా! దీనికిప్పుడు అందరి యెదరుగానే మానభంగం జరగాలి. నిన్ను బాడీగార్డులా పంపారు కదూ వాళ్ళ నాన్నగారు! నీ చేతే బట్టలు విప్పిస్తాను. చూస్తావేంట్రా రాస్కెల్ విప్పు...." అంటూ సింహాచలాన్ని ముందుకు తోసాడు రాజా.

"పాము... పాము...." అన్నాడు సింహాచలం వణికిపోతూ.

రాజా గతుక్కుమన్నాడు "ఎక్కడ?"

"అదిగో!.... ఇప్పుడే ఆ కన్నంలో కనిపించిందండీ! కర్రపట్రండి ఎవరయినా...." అంటూ హడావుడి చేసాడు సింహాచలం.

అక్కడ కన్నం వున్న మాట వాస్తవమే! కాని, పాముని ఎవరూ చూళ్ళేదు. మరి సింహాచలం చూసానంటాడు.... మొత్తం అందర్నీ భయపెట్టేసాడు. ఎవరో కర్రపట్టుకు వచ్చాడు. "నువ్వు చూసానంటున్నావు. నువ్వే చంపరా!" అని సింహాచలానికి చేతికందించాడు రాజా.

ఆ కర్ర పట్టుకొని గది మూలకు వెళ్ళినట్టే వెళ్ళాడు సింహాచలం. "....పాముని చూసింది అక్కడ కాదు రాజాబాబు! ఇక్కడ మీలో పామును చూసాను. ఆడపిల్లల మీద అత్యాచారం చేయటం మగతనమనిపించుకుంటుందా? నీతిమాలిన పనికి దిగుతున్నారు మీరు. మిమ్మల్ని ఒడుపు చూసి ఎలా పడగొట్టాలా అని యింతసేపు ఎదురుచూసా. మీ చేత్తో మీరే నా చేతికి కర్రయిచ్చారు. ఇప్పటికయినా బుద్ధి తెచ్చుకొని మర్యాదగా యిక్కడ్నించి పొండి. లేకపోతే మీకు కర్రదెబ్బలు తప్పవు...."

కొన్ని క్షణాల దాకా వాళ్ళెవరికి నోట మాట రాలేదు. చివరికి రాజాయే గొంతు విప్పాడు. "దొంగ రాస్కెల్! డబల్ క్రాస్ చేస్తావా?.... నిన్నేం చేస్తానో తెల్సా!...."

"అడుగు వేసే ముందు ఆలోచించండి. నా చేతిలో కర్ర ఉంది."

"నువ్వొక్కడివి. మేం ఆర్గురం..." అంటూ తన జేబులోని చాకు బయటకు తీయబోయాడు రాజా.

సింహాచలం చేతిలోని కర్ర ఎగిరింది. రాజా చెయ్యి అదిరిపోయింది. అంతా ఒక్కసారిగా సింహాచలం మీదకి దూసుకువచ్చారు. ఇక సింహాచలం మాటలకోసం ఆగలేదు. చేతి కర్రని గిరగిరా తిప్పాడు. కారు మెకానిక్‌గా శ్రమ తెల్సిన మనిషి అతను..... అతని ధాటికి కాలేజీ స్టూడెంట్స్ అంతమందున్నా ఆగలేకపోయారు. మోకాలి చిప్పలు చితికి ఒళ్ళు హూనం అయి..... అంతా నేలకరుచుకున్నారు.

మాధవి నోట్లోని గుడ్డలు వూడదీసి ఆమెను మంచంమీదనుంచి లేవదీసి కట్లు విప్పాడు సింహాచలం.... ఆమె కళ్ళలోకి నీళ్ళు పొంగివచ్చాయి.

జేన్‌కి కట్లు విప్పుతూ "త్వరగా పదండి" అన్నాడు సింహాచలం.

ఫారమ్‌హౌస్‌కి బయట గడియ పెట్టేసి అమ్మాయిలిద్దర్నీ తీసుకొని పరుగుపరుగున

కారు దగ్గరకి చేరాడు సింహాచలం.

సింహాచలానికి అక్కడక్కడా బాగా దెబ్బలు తగిలాయి. గాయాలనుంచి రక్తం చిమ్మింది. 'అయ్యో! రక్తం....' అంది మాధవి.

'ఫర్వాలేదు అమ్మాయిగారూ! ముందు యిక్కడ్నించి వెళ్ళిపోదాం. పదండి" అన్నాడతను. ముగ్గురూ కారెక్కారు. టౌన్‌వైపు కారు బయలు దేరింది. బయలు దేరే ముందు రోడ్డు మీద రాజా గేంగు వదిలి వేసిన స్కూటర్లకు పంక్చర్లు చేసి వాటిని నిరుపయోగం చేసి జాగ్రత్తపడ్డాడు సింహాచలం!

"వాళ్ళు చాలా క్రూరంగా అసహ్యంగా ప్రవర్తించారు. ప్రతిఘటిస్తే మరింత రెచ్చిపోతారు. అందుకనే, వాళ్ళేం చేసినా నేను మాట్లాడలేదు. నేను సింహాచలాన్ని పరీక్షిస్తూనే వున్నాను. అతను సాహసవంతుడే కాదు.... సమయస్ఫూర్తి వున్నవాడు కూడా!" అంది జేన్ మందహాసం చేస్తూ.

"నన్ను క్షమించు సింహాచలం. నిన్ను అనుమానించి అనరాని మాటలన్నాను. మా బావలా నువ్వూ పారిపోయి వుంటే మా గతి యేమయి వుండేది" అంది మాధవి పశ్చాత్తాపపడుతూ.

"అదేంటమ్మాయిగారూ! మాస్టారు నాతో మరీ మరీ చెప్పారు. బాధ్యత వదిలి నేనెలా పారిపోతాననుకున్నారు. ఛాన్సు కోసం చూసాను. దొరికినప్పుడు వాళ్ళపని పట్టాను. అంతే!"

"ఒక్కడివి. మొదట ఆర్గురిని ఎలా ఎదుర్కోగలననుకున్నావు? ఒకవేళ నీకు ప్రాణాపాయం జరిగివుంటే?...." అంది జేన్.

సింహాచలం చిరునవ్వు నవ్వాడు. "చూడండమ్మా! మీరు దేశం కాని దేశం నుంచి వచ్చారు. మా దేశం మీద గౌరవంతో మా మాస్టారి మీద అభిమానంతో వచ్చారు. మూడు నాల్గు రోజులనించి చూస్తున్నా. మీనోటివెంట ఏ మాట వచ్చినా మా మంచి గురించే! అలాంటిది ఈ రౌడీ కుర్రాళ్ళ మూలంగా దేశ మర్యాద మట్టి కల్సిపోవటమా! మీ కవమానం జరిగితే మాకు జరిగినట్టు కాదా! మనిషికి చావు ఒక్కసారే వస్తుంది.... ఒక మంచికోసం ప్రాణాలు పోయినా ఫర్వాలేదు..."

"అవును. వాళ్ళంతమంది వున్నా నీతి నియమాలు తప్పినవాళ్ళు. మాటకి నిలబడిన వాడిని ఒక్కడ్ని ఎదుర్కోలేకపోయారు. శాంతి, సహనం, అహింస.....ఇవే కాదు. ఎంతటి ధైర్యమయినా చూపించగల సాహసవంతులు మీ దేశంలో వున్నారు. దానికి సింహాచలం ఉదాహరణ!.... మీ నమ్మకాలు చాలా మంచివి. మీ ఆశయాలు చాలా ఉన్నతమయినవి. మీ దేశం నిజంగా గొప్పది మాధవీ!" అంది జేన్.

ఆమె చేతి స్పర్శకి వింత అనుభూతితో మాధవి ఒళ్ళు గగుర్పొడిచింది!

●